# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 31 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మే గురువారం | 1-5-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు

- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

### 92.78 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత

- ఫలితాల్లో 94.26 శాతంతో బాలికల పైచేయి
- మహబూబాబాద్ ఫస్ట్..వికారాబాద్ లాస్ట్
- ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణలో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. టెన్త్ ఫలితాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం రవీంద్రభారతిలో విడుదల చేశారు. 92.78 శాతం

-మిగతా 2 లో



### కులగణనకు తెలంగాణ

# రోల్ మోడల్

- తమ డిమాండ్‌కు కేంద్రం తలోగ్గింది
- విపక్ష నేత రాహుల్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కులగణన చేపట్టాలన్న తమ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదని విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కింపుతో పాటు కుల గణన చేస్తామని బుధవారం సంచలన ప్రకటన చేసింది. అయితే, ఈ నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ ఒత్తిడి మేరకే కేంద్రం తలొగ్గిందని, కుల గణనకు అంగీకరించిందని ఆయన అన్నారు. మేము కుల గణన నిర్వహిస్తామని

-మిగతా 2 లో



### సీఎస్‌గా రామకృష్ణారావు

# బాధ్యతలు స్వీకరణ

### అభినందనలు తెలిపిన మాజీ సీఎస్ శాంతికుమారి

**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఎస్ శాంతి కుమారి పదవీవిరమణ చేయడంతో.. రామకృష్ణారావును ప్రభుత్వం నూతన సిఎస్ గా నియమించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టులో ఆయన పదవీ విరమణ


-మిగతా 2 లో

### తెలంగాణ ఇస్తే పదేళ్లు

# దోపిడీ చేశావ్

### మళ్లి మమ్మల్ని విలన్ అంటావా

- పదేళ్లు మేమే అధికారంలో ఉంటాము.. అదే పదేళ్లు ఫార్మ్ హౌస్ లోనే ఉంటావు..
- ఏం చేస్తున్నామో...చేస్తలేమో సభకు వస్తే కదా తెలిసేది
- కేసీఆర్ విమర్శలను తిప్పికొట్టిన సీఎం రేవంత్





**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారాస రజతోత్సవ సభకు తాము సంపూర్ణంగా సహకరించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ఇలా ఎప్పుడూ చేయలేదన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన బసవేశ్వర 892 జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి పరీక్ష ఫలితాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల భారాస రజతోత్సవ వేడుకల్లో మాజీ సీఎం

-మిగతా 2 లో



### బంకర్‌లో దాక్కున్న ఉగ్రవాది

# హాఫీద్ సయీాద్

- భారీగా భద్రత కల్పించిన పాక్ ప్రభుత్వం

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్, ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీాద్‌కి పాకిస్తాన్ భారీ ఎత్తున భద్రత కల్పిస్తోంది. తన ఇంట్లోనే ఉన్న బంకర్లో అతను దాక్కున్నాడు. అతనికి ప్రభుత్వం కూడా భారీగా భద్రత కల్పించింది. పహల్గామ్ ఉగ్రదాడికి

-మిగతా 2 లో


# ఎల్‌వోసి వద్ద పాక్ కవ్వింపులు

- ధీటుగా జవాబు ఇస్తున్న భారత్ సైన్యం

**శ్రీనగర్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ కవ్వింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎల్‌వోసీ వెంబడి పాక్ సైన్యం కాల్పులకు తెగబడుతున్నది. దీంతో అప్రమత్తమైన భారత సైన్యం పాక్‌కు ధీటుగా బదులిస్తున్నారు. ఈ నెల మంగళ-బుధ వారాల్లో నౌషేరా, సుందర్‌బానీ, అఖ్నూర్ సెక్టార్లలో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ ఆర్మీ రెచ్చగొట్టేలా కాల్పులు జరిపాయి. భారత ఆర్మీ

-మిగతా 2 లో



# జనాభా లెక్కలతోనే కులగణన

- కేంద్రకేబినేట్ కీలక నిర్ణయం
- సరిహద్దు ఉద్రిక్తతలో పాటు పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్
- పలు రాష్ట్రాల్లో సర్వే అస్పష్టతగా ఉందని వ్యాఖ్య


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** దేశంలో కులగణనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే జనాభా లెక్కలతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించింది. జనాభా లెక్కల్లోనే కులగణను చేర్చుతామని కేంద్రం ప్రకటించింది. కులగణన పేరుతో కాంగ్రెస్ సర్వే చేయించిందని, ఆయా రాష్ట్రాల్లో చేపడుతున్న సర్వేల్లో పారదర్శకత లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. నేడు కేంద్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన వివరాలను మంత్రి

-మిగతా 2 లో

### సింగిల్ బెంచ్

# ఉత్తర్వులు రద్దుచేయం

### టిజిపిఎస్సీ పిటిషన్‌పై హైకోర్టు స్పష్టీకరణ



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపి వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. గ్రూప్ 1 వ్యవహారంపై టీజీపీఎస్సీ అప్పీల్‌పై హైకోర్టు డివిజన్

-మిగతా 2 లో

### ప్రధాని మోడీ రష్యా

# పర్యటన రద్దు

### విక్టరీ వేడుకల్లో పాల్గొనడం లేదని వెల్లడి



**న్యూఢిల్లీ ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** ప్రధానమంత్రి మోదీ రష్యా పర్యటన రద్దయ్యింది. మే నెలలో రష్యా నిర్వహించనున్న విక్టరీ డే వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొనడం

-మిగతా 2 లో

### కులగణన సర్వే

# చారిత్రక నిర్ణయం

- కాంగ్రెస్ ఏనాడు నిర్వహించలేక పోయింది
- మోడీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు
- కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటు కుల గణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగబోతోందని, అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే

-మిగతా 2 లో

# తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

(మొదటి తరువాయి)

మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే 1.47 శాతం అధికంగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరిగిన పది పరీక్షలకు దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం విడుదల చేశారు. ఫలితాల్లో 92.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది కంటే ఈసారి 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 94.26 శాతం మంది బాలికలు ఉత్తీర్ణత కాగా.. 91.32 శాతం మంది బాలురు పాసయ్యారు. అత్యధికంగా గురుకుల పాఠశాలల్లో 98.7 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. ప్రైవేటు- పాఠశాలల్లో 94.21 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులు, గ్రేడ్లను ఎస్ఎస్సీ బోర్డు ఇచ్చింది.పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరుగుతాయని ఎస్ఎస్సీ బోర్డు ప్రకటించింది. ఫీజు చెల్లింపునకు తుది గడువు మే 16గా నిర్ణయించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 15వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం సబ్జెక్టుకు రూ.500 చొప్పున చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ ఏడాది రెండు ప్రైవేటు- పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా పాస్ కాలేదు. ఈ ఫలితాల్లో మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 99.29శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. వికారాబాద్‌లో అతి తక్కువగా 73.97శాతం ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతిలో ఈసారి కొత్తగా సబ్జెక్టుల వారీగా మార్కులతో పాటు గ్రేడింగ్ కూడా ఇచ్చారు. ఈ విధనంగా మార్కుల మెమోలు జారీ చేయనున్నారు. మార్కుల మెమోలపైనా సబ్జెక్టుల వారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడ్ పొందుపరిచారు విద్యార్థి పాసయ్యారా..? ఫెయిల్ అయ్యారా...? అనేది మాత్రమే ఫలితాలలో కనిపిస్తుంది. ఇంకా బోధనేతర కార్యక్రమాల (కో కరిక్యులర్ యాక్టివిటీ-స్)లో విద్యార్థులకు గ్రేడ్లు ఇస్తారు. ప్రస్తుతం సిబిఎస్ఇలో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లను ముద్రిస్తున్నారు. వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీ-స్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రించారు.

# తెలంగాణ ఇస్తే పదేళ్లు దోపిడీ చేశావ్

(మొదటి తరువాయి)

కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన విమర్శలపై సీఎం దీటుగా స్పందించారు. ప్రతిపక్ష హోదా ఇచ్చిన ప్రజల వద్దకు ఎందుకు వెళ్లట్లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పథకాలు నిలిపివేసినట్లు కేసీఆర్ చెబుతున్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ, ప్రజాపాలన ఆగిందా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని మండిపడ్డారు. విప్లవకారుడు అంటే తుపాకీ పట్టుకోవాల్సిన అవసరం లేదని, విప్లవాత్మక మార్పు తెచ్చే ఎవరైనా విప్లవకారుడని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ పై బసవేశ్వరుడు ప్రభావం ఎక్కువని సీఎం అన్నారు. ప్రభుత్వ తప్పిదాలు సరిదిద్దేలా ప్రతిపక్ష వ్యవస్థ ఏర్పాటు- చేసుకున్నామని అలాగే, ప్రజల అభివృద్ధి జీవన ప్రమాణాలు పెంచేలా రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్నట్లు- ఆయన తెలిపారు. శాసన సభలో సభ నాయకుడిగా నేను, మంత్రులం అంతా పాల్గొన్నామని తెలిపారు. అయితే, నిన్నగాక మొన్న ఒకాయన వరంగల్ లో సభ పెట్టిండని, అయితే మాకేం అభ్యంతరం లేదన్నారు. ఇక సభకు ఎన్ని వందల బస్సులు అడిగితే అన్ని ఇవ్వండి అని మంత్రి పొన్నంకి చెప్పానని, అధికార పక్షమే కాదు.. ప్రతిపక్ష పార్టీ కూడా ఉండాలని అందుకు సహకరించామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అయితే, సభలో ప్రజల సమస్యలు ఏదైనా ప్రస్తావించారా..? మా లోపాలు చెప్పినవా..? మంచిని అభినందించావా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వం నుండి జీత భత్యాలు తీసుకుంటు-న్నారు.. ఏ చట్టంలో ఉన్నది, జీతాలు తీసుకుని పని చేయడం అని అంటూనే.. అన్ని వసతులు అనుభవిస్తూ, ప్రతిపక్ష పాత్ర పోషించకపోతే ఎలా అంటూ మండి పడ్డారు. అసెంబ్లీకి తాను రాను.. పిల్లల్ని పంపిస్తా అంటాడని సీఎం పేర్కొన్నారు. అయితే, మీరెందుకు మరి ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం..? మీకు ఎక్కడిది మమ్మల్ని అడిగే హక్కు.. ప్రతిపక్ష హోదా నీకు ఎందుకు? ఫార్మ్ హౌస్ లో పడుకుని ఏం సందేశం ఇస్తున్నారు? అధికారంలో ఉంటే చెలాయిస్తాం.. లేదంటే అసెంబ్లీకే రాను అంటే ఎట్లా? మేము ఇచ్చినవి అగినయి అంటున్నావు.. ఏమి అగినయని సీఎం ప్రశ్నించారు .మీరు సభకు రారు... కాబట్టి మేం ఏం చేస్తున్నామో ఎట్లా తెలుస్తుంది? మీరు ఏ మత్తులో జోగుతున్నారో తెలియదు.. విద్వేష పూరిత ప్రసంగం చేసి.. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారాని సీఎం రేవంత్ ఆగ్రహించారు. పదేళ్లు మేమే అధికారంలో ఉంటాము.. అదే పదేళ్లు ఫార్మ్ హౌస్ లోనే ఉంటావు.. తర్వాత నీ చరిత్ర ఫార్మ్ హౌస్ లోనే పరిసమాప్తం అంటూ ఎద్దేవా చేసారు. మీ కుటుంబం పదేళ్లు దోచుకోలేదా..? దేని మీద చర్చ చేద్దామో చెప్పు, సభ పెడదాం రా.. ప్రతిపక్ష నాయకుడిగా నిర్ణయాల్లో తప్పులు ఉంటే చెప్పండి సరిదిద్దుకుంటామని సీఎం మాట్లాడారు. అలాగే విషం చిమ్మే మాటలు వద్దు, ఆయన మాటల్లో, కండ్లల్లో విషం.. విచక్షణ ఉండాలి కదా... ఏం మాట్లాడుతున్నామో అని అన్నారు. మేము తెలంగాణ ఇస్తే.. పదేళ్లు దోచుకుని మమల్ని విలన్ అంటున్నావని ఫైర్ అయ్యారు. ప్రజలు అనాలి.. మీరు తెలంగాణ ఇస్తే... ఆయన ఆగం చేశారని మమ్మల్ని అనాలి, నువ్వు కాదని సీఎం అన్నారు.

# జనాభా లెక్కలతోనే కులగణన

(మొదటి తరువాయి)

అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీనిసూపర్ కేబినెట్‌గా వ్యవహరిస్తారు. బుధవారం జరిగిన భేటీలో కులగణనకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కులగణన అంశం కేంద్రం పరిధిలోకి వస్తున్నప్పటికీ.. కొన్ని రాష్ట్రాలు మాత్రం సర్వేల పేరుతో వాటిని నిర్వహించా యన్నారు. ముఖ్యంగా విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాజకీయ కారణాల వల్ల వాటిని చేపట్టారని విమర్శించారు. ఇందులో పారదర్శకత లేదన్నారు. కేవలం రాజకీయకారణాలతో చేసినందున స్పష్టత లేదన్నారు. అందుకే తదుపరి దేశవ్యాప్తంగా చేపట్టే జనాభా లెక్కల ప్రక్రియలో కులగణనను చేర్చి పారదర్శకంగా చేపట్టాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించి ముఖ్యంగా దృష్టిపెట్టిన కేంద్ర మంత్రివర్గం ఈ అంశంతో పాటు, దేశ వ్యాప్తంగా, వివిధ రాష్ట్రాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి కూడా నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. జనాభా లెక్కల్లో భాగంగా కులగణన కూడా చేస్తామని కేంద్రం పేర్కొంది. పారదర్శకంగా కులగణన జరగాలని కేంద్రం భావిస్తోంది. ఇందు కోసం సర్వేలపై ఆధారపడకుండా జనాభాలెక్కలలోనే ఈ విషయం నిర్ధారణ చేసుకుంటే సామాజిక సమతుల్యతకు ఆస్కారం లభిస్తుందని కేంద్రం నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లోని కాంగ్రెస్ సర్కార్లు తీసుకొచ్చే సర్వేలు చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని, దీని వల్ల సమాజ శ్రేయస్సు దెబ్బతినే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. అందుకే తదుపరి జనాభా లెక్కల్లో కుల సర్వేను కూడా చేర్చాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఏప్రిల్ 2020లోనే జనాభా లెక్కలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడిన విషయం తెలిసింది. భారత్-పాకిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. గత రెండు రోజులుగా దిల్లీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో రక్షణమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాధిపతులతో సమావేశం జరిగింది. ఇదే క్రమంలో బుధవారం భద్రతపై కేబినెట్ కమిటీ, అనంతరం రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ జరిగింది.

# సింగిల్ బెంచ్ ఉత్తర్వులు రద్దుచేయం

(మొదటి తరువాయి)



బెంచ్ విచారించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులును రద్దు చేయాలంటూ టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేయగా.. అందుకు సీజే ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ బెంచ్‌లో విచారణ దృష్ట్యా జోక్యం చేసుకోలేమని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. అనంతరం విచారణను గురువారానికి వాయిదా వేసింది. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు ఆరోపించారు. దీనిపై ఇటీ-వల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు మాత్రం అవకాశం కల్పించింది. అయితే, ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ సీజే ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేసింది.

## ప్రధాని మోడీ రష్యా

# పర్యటన రద్దు



(మొదటి తరువాయి)

లేదని వెల్లడైంది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రకటించింది. భారత్-పాక్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ మాస్కో పర్యటనకు మోదీ వెళ్లడం లేదని తెలుస్తోంది. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా విక్టరీ డేపేరుతో రష్యా ఏటా వేడుకలు జరుపుతుంది. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో మే 9న భారీ స్థాయిలో సైనిక కవాతు నిర్వహిస్తారు. 80వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మిత్ర దేశాధినేతలను పుతిన్ ఆహ్వానించారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి మోదీకి ఆహ్వానం అందింది. ఈ వేడుకల్లో పాల్గొననున్నట్లు- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# కులగణనకు తెలంగాణ రోల్ మోడల్

(మొదటి తరువాయి)

పార్లమెంట్‌లో చెప్పాము. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని కూడా రద్దు చేస్తామని అన్నాము. నరేంద్రమోడీ కేవలం 4 కులాలు ఉన్నాయని మాత్రమే చెప్పేవారు. ఏం జరిగిందో తెలియదు కానీ, 11 ఏళ్ల తర్వాత కులగణనను ప్రకటించారని అన్నారు. కులగణనపై ఎంత -టైమ్ పడుతుందో కావాలని, దీనిపై మరింత తెలుసుకోవాలని అనుకుంటున్నామని అన్నారు. ఇది మొదటి అడుగు మాత్రమే అని, తెలంగాణ కుల గణన కేంద్ర ప్రభుత్వానికి ఒక నమూనాలా, బ్లూ ప్రింట్‌గా మారవచ్చని ఆయన అన్నారు. కుల గణనకు ఈ ప్రభుత్వానికి మేము మద్దతు ఇస్తున్నామని, కుల గణనకు రెండు ఉదాహరణలు ఒకటి తెలంగాణ, రెండోది బీహార్ అని, ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉందని రాహుల్ చెప్పారు. కుల గణన ద్వారా రిజర్వేషన్లు మాత్రమే కాదని, కొత్త అభివృద్ధి నమూనాను తీసుకురావడమే తమ దృక్పథమని అన్నారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు వారి భాగస్వామ్యం ఎంత అనేది కుల గణన ద్వారా కనుగొనబడుతుందని చెప్పారు. ఆర్టికల్ 15(5) ప్రకారం, ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు ఇప్పటికే చట్టంగా ఉందని, ఎన్డీయే బీజేపీ ప్రభుత్వం దీనిని అమలు చేయాలని రాహుల్ గాంధీ కోరారు. ఉగ్రవాదంపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ కేంద్రాన్ని కోరారు. పెహల్గామ్ దాడికి పాల్పడినవారు సరైన మూల్యం చెల్లించుకోవాలని, ఉగ్రవాదంపై పోరుకు తమ మద్దతు ఉంటు-ందని చెప్పారు. ప్రధాన మంత్రి ఊగిసలాడకూడదని, అరకొర చర్యలు తీసుకోరాదని, పెహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారిని అమరవీరులుగా గుర్తించాలని కోరారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబీకులు తన ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేసినట్లు- వెల్లడించారు.

## సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతలు స్వీకరణ

(మొదటి తరువాయి)

చేయనున్నారు. ఆయన తన సర్వీసులో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా, 2016 నుంచి ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. 2021 నుంచి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కుడ్లిగి రామకృష్ణారావు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సిఎస్ శాంతికుమారితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కొత్త సిఎస్‌కు ఆమె అభినందనలు తెలిపారు.

# ఎల్‌వోసి వద్ద పాక్ కవ్వింపులు

(మొదటి తరువాయి)

సైనికులు వేగంగా స్పందించి ధీటు-గా బదులిచ్చిందని సైన్యం పేర్కొంది. భారత్ - పాకిస్తాన్ మధ్య జమ్మూకశ్మీర్ ప్రాంతంలోని సరిహద్దును వేరు చేసే సైనిక నియంత్రణ రేఖ లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద పాక్ వరుసగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఇది ఆరోసారి. ఈ నెల ఏప్రిల్ 22న పహల్గాంలో పాక్ ఉగ్రవాదులు 26మంది పర్యాటకులపై కాల్పులు జరిపి అత్యంత కిరాతకంగా చంపారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఎలోవోసీ వెంబడి పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉన్నది. ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ భయాందోళనకు గురవుతున్నారు. ప్రతిరోజూ ఆ దేశానికి చెందిన మంత్రులు భారత్‌తో పాటు-దాడుల గురించే మాట్లాడుతూ వస్తున్నారు. ఈక్రమంలో ఆ దేశ సైన్యం సైతం సరిహద్దుల వెంట నిరంతరం కాల్పులు విరమణను ఉల్లంఘిస్తూ వస్తున్నది. ఈ క్రమంలోనే వరుసగా ఆరవ రోజు కాల్పులు జరుపుతూ వచ్చింది.

## బంకర్‌లో దాక్కున్న ఉగ్రవాది హాఫీద్ సయీద్

(మొదటి తరువాయి)

పాల్పడింది లష్కరే ప్రాక్సీ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఉగ్రవాదులే అని తేలింది. పహల్గామ్ దాడి తర్వాత భారత టార్గెట్‌లో ఖచ్చితంగా హాఫీజ్ సయీద్ ఉన్నాడని తెలిసి పాకిస్తాన్ ప్రభుత్వం, ఐఎస్ఐ అతడికి హై లెవల్ సెక్యూరిటీని కల్పించినట్లు- తెలుస్తోంది. పాకిస్తాన్ పంజాబ్ రాజధాని లాహోర్‌లోని జన సాంద్రత ఎక్కువగా ఉండే ఒక ఏరియాలో హాఫీజ్ సయీద్ నివసిస్తున్నాడు. సాధారణంగా, ఉగ్రవాదులు మారుమూల ప్రాంతాల్లో ఉంటారు. అయితే, హాఫీజ్ సయీద్ మాత్రం బిజీ ఏరియాలో నివసిస్తున్నాడు. అతడి నివాసంలో మసీదు, మదర్సా ఉన్నాయి. అతడి కోసం ఒక ప్రైవేట్ పార్కు కూడా ఉన్నట్లు- నిఘా వర్గాలు గుర్తించాయి. పాకిస్తాన్ ప్రభుత్వ భద్రతలో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అత్యంత విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు. హాఫీస్ సయీద్ ఉంటున్న భవనం కింద బంకర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లు హాఫీజ్ సయీద్ జైలు ఉన్నాడని పాకిస్తాన్ బుకాయిస్తూ వస్తోంది. కానీ, అతను మాత్రం దర్జాగా అతడి నివాసం నుంచే ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. గత నెలలో, హాఫీజ్ సయీద్ సన్నిహితుడు అబూ ఖతల్ హత్య తర్వాత పాకిస్తాన్ హాఫీజ్ సయీద్‌కి భద్రతను కట్టు-దిట్టం చేసింది. పహల్గామ్ దాడి నేపథ్యంలో ఈ భద్రతను మరింత పెంచినట్లు- తెలుస్తోంది. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అతడి నివాసాన్నే సబ్ జైలుగా మార్చింది. సయీద్ బాహ్య ప్రాంతాలకు వెళ్లకుండా ఐఎస్ఐ అతడిని నిరోధిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి.

# కులగణన సర్వే చారిత్రక నిర్ణయం

(మొదటి తరువాయి)

ఈ సర్వేలో కులాల వారీగా ఎంత జనాభా ఉందో నిక్కచ్చిగా తెలుతుందని.. తద్వారా ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరిగే అవకాశముందని వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ కుల గణనకు వ్యతిరేకి. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. జనగణన సమయంలో కూడా కులాన్ని చేర్చలేదుని.. కులగణన చేపట్టాలంటూ 2010లో దేశవ్యాప్తంగా చాలా రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తే ఈ అంశంపై మంత్రుల బృందాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. కానీ, కుల గణనకు బదులుగా సర్వే మాత్రమే నిర్వహించాలని నిర్ణయించిందే తప్ప శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించనే లేదు. కేవలం ఓటు- బ్యాంకు రాజకీయాల కోసమే కులగణన అంశాన్ని కాంగ్రెస్ లెవనెత్తుతుందే తప్ప ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. మోడీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతే అయితే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కులగణన ఎందుకు చేయలేదో సమాధానం రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.

## 2025 మే 1, గురువారం తెలుగు పంచాంగం



**మాసం - పక్షం**
మాసం: వైశాఖమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
**తిథి**
చతుర్థి: మే 1, తెల్లవారుజామున 12:38 AM వరకు
పంచమి: మే 1, తెల్లవారుజామున 12:38 AM నుండి మే 2, రాత్రి 10:38 PM వరకు
**నక్షత్రం**
మృగశిర: మే 1, మధ్యాహ్నం 2:02 PM వరకు
ఆరుద్ర: మే 1, మధ్యాహ్నం 2:02 PM నుండి మే 2, మధ్యాహ్నం 12:35 PM వరకు
**సూర్యోదయం -సూర్యాస్తమయం**
సూర్యోదయం: ఉదయం 5:54 AM
సూర్యాస్తమయం: సాయంత్రం 6:32 PM
**చంద్రోదయం - చంద్రాస్తమయం**
చంద్రోదయం: ఉదయం 8:25 AM
చంద్రాస్తమయం: రాత్రి 10:13 PM
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:17 AM నుండి 5:05 AM వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:48 AM నుండి 12:38 PM వరకు
అమృతకాలం: మధ్యాహ్నం 3:31 PM నుండి 4:56 PM వరకు
**అశుభ సమయాలు**
రాహుకాలం: మధ్యాహ్నం 1:52 PM నుండి 3:27 PM వరకు
యమగండం: ఉదయం 6:55 AM నుండి 8:30 AM వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 10:32 AM నుండి 11:23 AM వరకు
సాయంత్రం 3:20 PM నుండి 4:10 PM వరకు
వర్జ్యం: ఉదయం 10:27 AM నుండి 11:53 AM వరకు

# మోటకొండూరు ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీ ప్రమాదం వెనుక అధికారుల నిర్లక్ష్యం





- భద్రత చర్యల లోపం వల్లే పేలుడు..
- పట్టించుకొని కంపెనీ యాజమాన్యం
- మరణించిన కార్మికులకు న్యాయం జరిగేనా, కుటుంబాల పరిస్థితి ఏంటి..?
-- " నీలగిరి ఎక్స్ ప్రెస్ " ప్రత్యేక కథనం..












**మోటకొండూరు,ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి లోనీ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం జరిగిన ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి "నీలగిరి ఎక్స్ ప్రెస్ దిన పత్రిక" పలు అంశాలు బయటకు బయటపెట్టింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని తెలుస్తోంది. కార్మికులు, ప్రజల ప్రాణాలకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా చర్యలను గాలికొదిలేస్తున్నాయి. తాజాగా జరిగిన ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ ప్రమాదమే దీనికి నిదర్శనం. ఈ అంశాలపై దృష్టి సారించి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని అధికారులు చెబుతున్నారు. పరిశ్రమల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై ప్రభుత్వం కొన్ని సాధారణ నియమాలను రూపొందించింది. రసాయనాలు, వేడి, భౌతిక ప్రభావాల వల్ల సంభవించే ప్రమాదాల నుంచి రక్షణ పొందడం కోసం కార్మికులు చేతులకు తొడుగులు, కళ్లకు గాగుల్స్, రెస్పిరేటర్లు వంటివి ధరించాలి. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించాలి. భద్రతా వైఫల్యాలు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ విభాగాలు, కలెక్టర్లపై ఉంది. జిల్లాల్లో కలెక్టర్లు చైర్మన్లుగా ఆయా శాఖల అధికారులతో నియమించిన కమిటీలు క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రతి ఆరు నెలలకొకసారి అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి, భద్రతా చర్యలను పరిశీలించాలి. జిల్లా స్థాయి కమిటీలు గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలను స్టేట్ లెవెల్ మానిటరింగ్ కమిటీకి నివేదించాలి. ఈ మానిటరింగ్ ప్రక్రియ సక్రమంగా జరగకపోవడం వల్లే వరుస ప్రమాదాలు సంభవిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- ప్రమాదం జరిగింది ఎలా అంటే..?**
వారంతా రెక్కాడితేగాని.. డొక్కాడని కుటుంబాలకు చెందినవారు. పొద్దస్తమానం కష్టపడితే తప్ప కుటుంబాలను పోషించుకోలేని దీనస్థితి. ఉదయం ఆరు గంటలకు విధుల్లో చేరిన వారు ఇంకో పావుగంటలో ఇంటికి వెళ్తారనుకునే సమయానికి ఒక్కసారిగా విధి వక్రించింది. అప్పటిదాకా అంతా కలిసి పనిచేసిన బ్లాక్‌లో భారీ పేలుడు సంభవించి కొందరి శరీరాలు చెల్లాచెదురు కాగా, మరికొందరు శకలాల కింద చిక్కుకున్నారు. ఇంకొందరికి తీవ్ర గాయాలు కావడంతో మొదట భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు పరిస్థితి విషమం కావడం తో సికింద్రాబాద్ లోని యశోద ఆస్పత్రి కి తరలించారు. ఈ పేలుడు ధాటికి రెండు కిలోమీటర్ల వరకు భూమి కంపిచనట్లయిందని స్థానికులు పేర్కొన్నారు స్థానికులు, అధికారుల వివరాల ప్రకారం.. కంపెనీలోని సెక్షన్ 18ఏ భవనంలో శ్రీహరికోట రాకెట్ లాంచ్ వెహికిల్‌లో వినియోగించే ప్రొఫలెంట్ మిక్సింగ్ చేస్తున్న సమయంలో భారీ పేలు డు సంభవించింది. ఈ ఘటనలో భవనం పూర్తిగా కుప్పకూలిపోయింది. అదే సమయంలో అక్కడ ఏడుగురు కూలీలు విధులు నిర్వర్తిస్తున్నారు. పేలుడు ధాటికి పక్కన ఉన్న భవనాలు పగుల్లు పడడంతోపాటు శకలాలకింద మాంసపు ముద్దలు పడిఉన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిలో మండల కేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్(22), కాటేపల్లికి చెందిన గునుకుంట్ల సందీప్(30) ఉన్నారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన కాల్వల నరేష్(33) తీవ్రంగా గాయపడగా, మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురు క్షతగత్రులు వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన బుగ్గ లింగస్వామి, చాడ గ్రామానికి చెందిన రాజబోయిన శ్రీకాంత్, యాదగిరిగుట్ట మండలం కాచారంనకు చెందిన బర్ల శ్రీకాంత్, పెద్దకందుకూరు గ్రామానికి చెందిన సంద మహేందర్, మోటకొండూరు మండలం బెజ్జంకిబావికి చెందిన సలేంద్ర మహేష్, భువనగిరి మండలం అనాజిపూరం గ్రామానికి చెందిన ఎన్.మహేషకు తీవ్రగాయాలు కాగా భువనగిరిలోని ప్రైవేట్ అసుపత్రికి తరలించి చికిత్స చూపిస్తున్నారు. బుధవారం కంపెనీ ముందు బాధిక కుటుంబాలు బైఠాయించి ధర్నా నిర్వహించారు.

**- మృతుల కుటుంబాలకు ఒక్కరికి కోటి రూపాయలు**
**-- మరి గాయపడిన వారి పరిస్థితి ఏంటి..?**
చనిపోయిన బాధితుల అందరి అభిప్రాయం సేకరించి బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో మృతుల కుటుంబాలకు ఒక్కరికి కోటి రూపాయలు మరియు ఇతర ఇన్సూరెన్స్ అలవెన్స్ లో ఏమైనా ఉంటే అదనంగా ఇస్తామని, కుటుంబంలో ఒకరికి కంపెనీలో పర్మనెంట్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కోటి రూపాయలను తక్షణమే 50 లక్షలు రూపాయలు ఒక్కొక్కరికి చెల్లించి మిగతా 50 లక్షలు 25, 25 లక్షలు రెండు నెలలు , రెండు నెలలు వ్యవధిలో చెల్లిస్తామని కంపెనీ యాజమాన్యం ఒప్పుకుంది మరి గయా పడిన వారికి ఎలాంటి న్యాయం చేస్తారో వేచి చూడాలి.

## షాద్ నగర్ బస్ స్టాండ్ లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం



**షాద్ నగర్, ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వాసవి వనిత క్లబ్ షాద్ నగర్ వారి ఆధ్వర్యంలో షాద్ నగర్ బస్టాండ్ లో అక్షయ తృతీయ సందర్భంగా సామాజికవేత్త నీల రవీందర్ మజ్జిగ పంపిణీకి సహకరించడం జరిగింది.వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బస్టాండ్లో వేసవికాలంలో దాతల సహకారంతో చల్లటి నీరు మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో షాద్నగర్ వాసవి క్లబ్ అధ్యక్షులు కల్వ మాణిక్యం గుప్తా మరియు వనిత క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియ,నీల ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నీల రవీందర్ మాట్లాడుతూ వేసవి కాలంలో చల్లటి నీరు మరియు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం ఎంతో అభినందించదగ్గ విషయమని షాద్నగర్ వాసవి క్లబ్ అధ్యక్షులు కల్వమాణిక్యంని అభినందించడం జరిగింది.

## పదవ తరగతి ఫలితాలలో వనపర్తి జిల్లాకు 29వ స్థానం

### 91.10 శాతం తో వనపర్తి అమ్మాయిలదే హవా

**వనపర్తి,ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
2025 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల ఫలితాల్లో వనపర్తి జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. మొత్తం 6,842 మంది పరీక్షలు రాయగా 6,104 మంది పాసయ్యారు. 3,415 మంది బాలురు పరీక్షలు రాయగా 2,982 మంది పాసై మొత్తం 87.32 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 3,427 మంది బాలికలు పరీక్షలు రాయగా 3,122 మంది పాసై 91.10 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలురు పై బాలికలు పైచేయి సాధించారు ,బాలురు 87.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. సాధారణంగా 89.21 శాతంతో వనపర్తి జిల్లా స్టేట్లో 29వ స్థానంలో నిలిచింది.

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు నియంత్రించండి..



**మెదక్ జిల్లా -ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మెదక్ జిల్లాలో ప్రవేట్ పాఠశాలలో ముందస్తు అడ్మిషన్స్ చేసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏ ఐ యస్ యఫ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర చాకలి పాపయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా అడ్మిషన్స్ చేస్తున్న మెదక్ జిల్లా విద్యా అధికారి పాపయ్య ఈరోజు పాపన్నపేటలో విలేకరుల పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. అదేవిధంగా ముందస్తు అడ్మిషన్స్ తీసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు,లేని యెడల మెదక్ జిల్లా ఏ ఐ యస్ ఆఫ్ సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తునా ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## ఆరవ తరగతి అడ్మిషన్లకు పత్రాలు తప్పనిసరి



**వెల్దండ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండలంలోని గుండాల గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం విద్యార్థులు అవసరమైన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ సూచించారు. ప్రవేశానికి హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, వైబ్సైట్ ర్యాంకు కార్డు లేదా అడ్మిషన్ కార్డు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్, బోనాఫైడ్ లేదా స్టడీ సర్టిఫికేట్, ఐదవ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, ఒరిజినల్ మెడికల్/ఫిట్నెస్ సర్టిఫికేట్, విద్యార్థి ఆధార్ కార్డు, ఆధార్ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, జనన ధృవీకరణ పత్రం, విద్యార్థి ఫోటోలు (నాలుగు), కుటుంబ ఫోటో (ఒకటి), అంగవైకల్యం ఉంటే సంబంధిత ధృవీకరణ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పత్రాలను ఏప్రిల్ 29వ తేదీ నుంచి మే 9వ తేదీ మధ్యలో పాఠశాలకు తీసుకురావాలని సూచించారు.

## ఘనంగా శ్రీ మహాత్మా బసవేశ్వరుని 892వ జయంతి



**మంచాల, ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శ్రీ మహాత్మా బసవేశ్వరుని 892వ జయంతి వేడుకలను రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం మంచాల మండలం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు కొత్తూరు శేఖరప్ప జెండా ఆవిష్కరణ చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చి రెడ్డి హాజరై, మహాత్మ బసవేశ్వరుని విగ్రహానికి పుష్పమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 12వ శతాబ్దంలో వీరశైవ మత సిద్ధాంతాలను చాటి చెప్పి మతోద్ధరణ చేసిన సంఘసంస్కర్త, మానవతావాది బసవేశ్వరుని విగ్రహాన్ని మంచాల మండల కేంద్రంలో ప్రతిష్ఠించడం గర్వకారణమని పేర్కొన్నారు. జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె. బిక్షపతి, బీజేపీ జిల్లా నాయకుడు పొండాల జంగయ్య గౌడ్, మంచాల మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజు, బలిజ సంఘం నాయకులు జక్కా హరీష్, బీజేవైఎం యువ నాయకులు జక్క శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**కద్తాల్, ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు కారణమయ్యాయి. కద్తాల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఈ వ్యాఖ్యలపై తమ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభినవ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించడంతో పాటు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన చర్చలో నాయకులు పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దక్షిణ భారతదేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే నేతలు కాంగ్రెస్‌లో ఉన్నారని చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. కాంగ్రెస్ పార్టీ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిందని, దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన నాయకులు కాంగ్రెస్‌లో ఉన్నారని వారు గుర్తుచేశారు. ఇలాంటి దేశభక్తి నిండి ఉన్న పార్టీలో



అసత్య ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యం అని నాయకులు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకులపై "పాకిస్తాన్ వెళ్లిపోండి" అంటూ చేసిన వ్యాఖ్యలు సమాజానికి అభ్యంతరకరమని, పవన్ కళ్యాణ్ వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మొహ్మద్ ఇమ్రాన్ బాబా, కద్తాల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోసు రవి, మండల ప్రధాన కార్యదర్శి కందికంటి రాజేందర్, జంగం ఆకాష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, సోమరాజు సందీప్, మహేష్, భాస్కర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.
అన్నివేళలా మీతో పాటు ఉంటుంది
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.
మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# భూభారతి చట్టంతో భూ సమస్యలకు చెక్

**-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కొందుర్గు, ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కొందుర్గ్ రైతు వేదిక వద్ద,చౌదర్ గూడెం రైతు వేదిక మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పాటు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం రైతుల చుట్టం,భూ వివాదల శాశ్వత పరిష్కారానికి తెచ్చిందే భూ భారతి చట్టం అన్నారు.ప్రతి వ్యక్తికి ఆధార్ లాగా ప్రతి భూమికి భూదారని చెప్పారు.భూమి రికార్డులను మోసపూరితంగా మార్చి ప్రభుత్వ,భూధాన్ ,అసైన్డ్,దేవాదాయ, భూములను ఎవరైనా పట్టా చేసుకుంటే వాటిని రద్దు చేసేలా సిసిఎల్ఎ అధికారాలు ఉంటాయన్నారు. కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ తెచ్చుమని,ఎవరి భూమి అయిన వేరే వాళ్ళకు తప్పుగా నమ్ముదైతే ఎమ్మార్వో,ఆర్డీవో,జేసీ,కలెక్టర్కు అప్పీలు చేసుకొని పరిష్కరించుకోవచ్చన్నారు.ప్రతి గ్రామానికి గ్రామ పరిపాలన అధికారులను నియమించడంతో రైతులకు అన్ని సేవలు గ్రామంలోని




అందుతాయన్నారు.రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు ప్రజలకు అన్ని సేవలు అందించేలా ఉపయోగపడుతుందన్నారు. ధరణి వల్ల రైతులు భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ఆర్ఓఆర్ చట్టం భూభారతితో సులభంగా పరిష్కారం అవుతుందన్నారు.ధరణి రిజిస్ట్రేషన్ లో పొరపాటు జరిగిన సరిదిద్దుకునే అవకాశం ఉండేది కాదని రైతులు,పేదలు కోట్ల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు.ధరణి అన్నదమ్ములు,కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు పెట్టిందని విమర్శించారు.ప్రభుత్వం తెచ్చిన కొత్త చట్టం మొత్తం పారదర్శకంగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత ,షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్అలీఖాన్,మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, రాజు,ఇబ్రహీం,చంద్రశేఖర్,రాజా రత్నం, గోవర్ధన్ గౌడ్ పురుషోత్తం రెడ్డి, గోపాల్, రాముల గౌడ్ ,యాదయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం

**-ధాన్యం రాశుల దగ్గర రైతుల పడిగాపులు పట్టించుకోని మంత్రులు**
**-సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి**



**వనపర్తి,ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కాంగ్రెస్ ప్రభుత్వ హయాములో రైతుల దీనస్థితి హృదయ విదారకంగా ఉందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.
కరెంట్ ,సాగునీళ్ళు సరిగా రాకున్నా కష్టపడి పండించుకున్న ధాన్యం సకాలములో కొనుగోలు జరగక రైతులు ఐ.కే.పి,పి.ఏ.సి.ఎస్ తదితర కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. యాసంగి పంటలో ఎటువంటి తేమగాని,తరుగుకాని ఉండదు కానీ అధికారులు తేమ ఉందని కొన్నిరోజులు,తాళ్ళు ఉందని కొన్నిరోజులు, గన్ని బ్యాగులు లేవని కొన్నిరోజులు,లారీలు రాలేదని కొన్ని రోజులు రైతులను నానా ఇబ్బందిపెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం కొత్త గన్ని బ్యాగులు కొనుగోలు చేశామని చెబుతున్న క్షేత్రస్థాయిలో నాసిరకం బ్యాగుల వాడకం వల్ల అక్కడ కూడా రైతులు తరుగు కోల్పోవడం తో పాటు తేమ,తాళ్ళు అంటూ తరుగు కోల్పోవడంతో రైతులు తీవ్ర నష్టం ఎదురుకుంటున్నారని అన్నారు. రైతులు తూకం అయిపోగానే వాళ్ల పని అయిపోతలేదని బ్యాగులు నింపి ట్రాన్స్పోర్ట్ వరకు ఆగాలివస్తుందని వారికి సరిఅయిన సమయం అధికారులు చెప్పకపోవడం వల్ల రైతులు అన్ని పనులు వదులుకొని అక్కడ ఉండాల్సి వస్తుందని,ఇప్పటికైనామంత్రులు ,అధికారులు వెంటనే స్పందించి సకాలములో మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలిచిన కె.సి.ఆర్ ని వదులుకొని కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు హరిగోసా పడుతున్నారని ఘాటుగా విమర్శించారు ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,ఇమ్రాన్,నారాయణ నాయక్, మాజీద్,శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవల్లో అదనపు వసూళ్లు.. ప్రశ్నిస్తే అంతే అంటూ వ్యంగ్య సమాధానాలు

**- మండలంలో మీ సేవ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు**




**మోటకొండూరు,ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
మండలంలో మీ సేవ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదాయ, కుల,నివాస ధ్రువీకరణ పత్రాలకు నిర్ణీత రుసుము కంటే అదనంగా వసూళ్లు చేస్తూ దరఖాస్తుదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వ్యంగ్య సమాధానాలు ఇస్తున్నారని వాపోతున్నారు. మోటకొండూరు మండల కేంద్రంలో మీ సేవ నిర్వాహకులు ఆదనపు వసూళ్లకు తెరతీశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు దృష్టి సారించక పోవడంతోనే మీ సేవ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఏజెన్సీలో వెల్లువెత్తుతున్నాయి.

**- అసలు ఏం జరుగుతుంది..**
మీ సేవ కేంద్రాల్లో ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే మీ సేవ నిర్వాహకులు రుసుము రూ.45 వసూలు చేయాలి. ఒక్కో దరఖాస్తుకు రూ.150 వసూలు చేస్తున్నారు. ఇటీవల ఓ వ్యక్తి కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోగా మొత్తం రూ.405 కాగా, నిర్వాహకులు మాత్రం రూ.600 వసూలు చేసినట్లు వాపోయాడు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు నీలగిరి ఎక్స్ ప్రెస్ దినపత్రిక ద్వారా కోరుతున్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



**ఎల్బీనగర్ ఏప్రిల్ 30/ ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ )**
పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గతంలో జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చామని దాని ప్రతి తమరికి పంపుతామన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య తాసిల్దార్ కు వినతి పత్రం సమర్పిస్తూ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తహసిల్దార్ని కోరుతున్నామని, నిరుపేదలను దృష్టిలో పెట్టుకోని తమరు సర్వేనెంబర్ 71, 162 లోని ప్రభుత్వ భూమిని ఇల్లు లేని పేదలకు ఇవ్వాలని తమరిని కోరుతున్నాము అన్నారు. ఇప్పటికే ఆ భూములలో అక్రమంగా ఆక్రమించారని, అసలైన పేదలకు ఇవ్వలేదని అన్నారు. జూన్ 7- 2023 లో 1200 మంది పైగా పేదలు అప్పటి తాసిల్దారికి దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఇట్టి భూమిని ఇల్లు లేని పేదలకు ఇవ్వాలని తమరిని కోరుచున్నాము అన్నారు. నేడు పేదలు గ్రామాలను వదిలిపెట్టి పని దొరుకుదని హైదరాబాదుకు వచ్చి వారి చేసిన కష్టం ఇంటి అద్దె చెల్లించలేక పస్తులతో ఉపవాసాలు ఉంటున్నారని, అలాంటి పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని తాసిల్దార్ కి విన్నవించారు. ఇల్లు లేని పేదలు ఇళ్ల స్థలం కోసం సర్వే నెంబర్ 71 పైకి వెళుతున్న క్రమంలో కొంతమంది పై అక్రమ కేసులు బనాయించారని, అక్రమ కేసు ఎత్తివేయాలని కోరారు. అర్హులైన ఇల్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇండ్లు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న డబల్ బెడ్ రూములను తక్షణమే ఇల్లు లేని వారికి ఇవ్వాలని కోరుతూ ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డి, సర్కిల్ కార్యదర్శులు ఆలేటి ఎల్లయ్య, సిహెచ్ వెంకన్న, సిపిఎం నాయకులు సిహెచ్ కృష్ణయ్య, కొత్త గణేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటి కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి,ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి నియోజకవర్గంల్ పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభాలు, శంకుస్థాపనలతో పాటు భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వస్తున్న



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసురెడ్డి కార్యక్రమాల ఏర్పాట్లను బుధవారం వనపర్తి శాసనసభ్యులు.తూడి మేఘారెడ్డి పరిశీలించారు.మొదటగా కలెక్టర్ కార్యాలయ సమీపంలోని హెలిపాడ్ ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.మెడికల్ కళాశాల విద్యార్థుల వసతి గృహం ప్రారంభ కార్యక్రమం,వనపర్తి ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభ కార్యక్రమాలను సందర్శించారు.వర్చువల్ విధానంలో రేవల్లి, ఏదుల శ్రీరంగాపురం తాసిల్దార్ కార్యాలయాల నూతన భవన నిర్మాణాల శంకుస్థాపన, ఎస్సి బాలికల వసతిగృహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్ల కార్యక్రమాలను పరిశీలించారు.పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల వసతి గృహ ప్రారంభ కార్యక్రమం ఏర్పాట్లు,అంబేద్కర్ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్ట అభివృద్ధి పనుల శంకుస్థాపన ఏర్పాట్లును పరిశీలించారు.కళ్యాణ సాయి గార్డెన్ లో భూభారతి చట్టం అవగాహన కార్యక్రమం, ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ, వేసవి శిబిరాలకు క్రీడా సామాగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు.కార్యక్రమంలో స్థానిక ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.

-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.

-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.

-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# పరిశ్రమల్లో భద్రత డొల్ల






- కనీస రక్షణ చర్యలు శూన్యం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- దూరంగా సేఫ్టీ అధికారుల కార్యాలయాలు








**హైదరాబాద్,ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పరిశ్రమలలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. రెండు నెలల వ్యవధిలోనే తెలంగాణ వ్యాప్తంగా పారిశ్రామిక వాడల్లో ప్రమాదాలు సంభవించాయి. చిన్నా, మధ్య తరహా కర్మాగారాలతో పాటు పేరెన్నిక గల పరిశ్రమలలోనూ ప్రమాదాలు వాటిళ్లుతుండడంతో ఫ్యాక్టరీలు తీసుకుంటున్న భద్రతా చర్యల డొల్లతనం ఏమిటో అర్థమవుతున్నది. రక్షణ అంశాలను పరిశీలించాల్సిన అధికారుల నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనపడుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు పరిధిలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో అనే బాంబుల ముడిసరకుల తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో కల్వల నరేశ్ , జి సందీప్, సీహెచ్ దేవీచరణ్ ముగ్గురు మృతి చెందారు. ఇదే కాదు గత కొన్ని నెలలుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చాలా పరిశ్రమల్లో పేలుడు సంభవించి చాలా మంది మృతి చెందారు. ఈ పేలుడు ముఖ్య కారణం భద్రత చర్యల లోపం వల్లే అని ఆందోళన వ్యక్తమౌతోంది.

**- కార్మికులకు రక్షణ కరువు**

పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇల్లు చేరటం కష్టంగా మారింది. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు లేకపోవటం..నైపుణ్యం గల కార్మికులను వినియోగించకపోవటం అధిక ప్రమాదాలకు కారణంగా చెప్పవచ్చు. ముఖ్యంగా ప్రమాదాలకు అధిక కారణంగా నిలిచే రియాక్టర్లు బాంబుల్లా పేలుతున్నాయి. ఇక్కడ నిపుణులైన కార్మికులు పనులు చేయాల్సి ఉన్న.. కనీస అవగాహన లేని టెంపరరీ, కాంట్రాక్ట్ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. రియాక్టర్ల ఒత్తిడిని సరైన



సమయంలో గుర్తించక పోవటం, కెమికల్ రియాక్షన్‌ను నివారిచటంలో విఫలం కావటంతో పేలుళ్లు జరుగుతున్నాయి. ఇక ప్రమాదం జరిగిన వెంటనే పరిశ్రమ వర్గాలు చికిత్స కోసం క్షతగాత్రులను తరలించటం.. కొన్నిమార్లు వారు ఏమయ్యారో కూడా తెలియని పరిస్థితులు నెలకొంటున్నాయి. కాగా చాలా పరిశ్రమల సమీపంలో ప్రమాదాలు జరిగిన వెంటనే చికిత్స కోసం తరలించేందుకు అంబులెన్స్ సౌకర్య లేక నగరానికి చేరేలోపు కొందరు మరణించిన ఘటనలు ఉన్నాయి.

**- పరిశ్రమలు ఇక్కడ.. అధికారులు ఎక్కడో**

తెలంగాణ వ్యాప్తంగా పరిశ్రమలల్లో రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పరిశ్రమలు ఇక్కడుంటే రక్షణ అంశాలు పరిశీలించాల్సి అధికార కార్యాలయాలు మాత్రం హైదరాబాద్ ఉన్నాయి. దీంతో పరిశ్రమల్లో నిత్యం తనీఖీ చేయటం వట్టి మాటగా మారింది. కేవలం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావిడి చేసే అధికారులు, నాయకులు అనంతరం ఇటు వైపు చూడటం లేదు. నెలలో కనీసం ఐదు వరకు ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. వరుసగా జరుగుతున్నా ప్రమాదాలతో కార్మికుల కుటుంబాలతో పాటు స్థానిక ప్రజలు సైతం భయాందోళనలో వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా బసవ జయంతి మరియు ఆది జగద్గురు ఏకోరామరాధ్య జయంతి



**షాదనగర్, ఏప్రిల్ 30(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కిషన్నగర్ శివారులోని శ్రీ జగద్గురు పంచాచార్య వీరశైవ వేదాగమ పాఠశాలలో అక్షయ తృతీయ సందర్భంగా వీరశైవ ధర్మసంస్థాపకులైన శ్రీ ఆది జగద్గురు పంచాచార్యులలో ఒకటైన శ్రీ కేదార పీఠానికి మూల జగద్గురువు ఎకోరామారాధ్య శివాచార్య జయంతి మరియు మహా మానవతావాది, సంఘసంస్కర్త మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షుడు అగ్గనూరు బసవేశ్వర మాట్లాడుతూ, వీరశైవ ధర్మం వేల సంవత్సరాల చరిత్ర కలిగిన ధర్మమని, దీనిని ఆది జగద్గురు పంచాచారులు సంస్థాపించారని పేర్కొన్నారు. ఈ ధర్మంలోని సమానతత్వాన్ని ఎరిగిన మహాత్మా బసవేశ్వరులు 12వ శతాబ్దంలో ఈ ధర్మాన్ని స్వీకరించి, వర్గవర్ణ కుల రహితంగా ప్రచారం చేసిన మహా మానవతావాదిగా నిలిచారని ఆయన అభిప్రాయపడ్డారు. కాయకమే కైలాసమనే ధ్యేయవాక్యాన్ని సమాజానికి అందించిన మహా మానవతావాది జంగమ ప్రేమిగా బసవేశ్వరులు మార్గదర్శకులయ్యారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్. కాశీనాథ్, శివకుమార్ అగ్గనూరు బసవేశ్వర్, షాదనగర్ తాలూకా జంగమ సమాజం అధ్యక్షుడు మఠం రాచయ్య స్వామి, గవ్వయ్య స్వామి, చౌదరిగూడం రాజశేఖర్, గిరిజాపతి, పత్రకర్త రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ శ్రీ సంగయ్య స్వామి, హిరేమఠ మిరియం కోటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపూర్ విద్యార్థికి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఫోన్



**యాదాద్రి భువనగిరి,ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
టెన్త్ ఫలితాల్లో 73 శాతం మార్కులు సాధించిన విద్యార్థికి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపూర్ మండలం కంకణాల గూడెంకి చెందిన భరత్ చంద్ర చారి అనే విద్యార్థిది నిరుపేద కుటుంబం. కలెక్టర్ గతంలో వాళ్ల ఇంటికి వెళ్లి ఆర్థికసాయం చేశారు. కష్టపడి చదవాలని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భరత్ కష్టపడి చదివి 73 శాతం మార్కులతో పాసవడంతో కలెక్టర్ ఫోన్ చేసి విషెస్ చెప్పారు.

## పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన ఇర్విన్ జడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు

**మాడుగుల, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పదవ తరగతి ఫలితాల్లో జడ్‌పిహెచ్‌ఎస్, ఇర్విన్ విద్యార్థులు అద్భుత విజయాన్ని నమోదు చేశారు. మొత్తం 96 మంది పరీక్షలకు హాజరవగా, 90 మంది ఉత్తీర్ణులై 93.75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇది పాఠశాల స్థాయిలో అరుదైన ఘనతగా నిలిచింది. అత్యధిక మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థి రాజమౌళి అశ్విని 565 మార్కులు సాధించింది. ఆమెతో పాటు మారం సౌమ్యశ్రీ (560), పాలకూర స్పందన (559), సామల రమ్యశ్రీ (559), మహమ్మద్ జునైద్ (554), మరల శ్వేత (554), ఆకుతోట స్నోహిత్ (553), ఆకుతోట స్రోహిత్ (550) మార్కులతో మేధాస్ఫూర్తిని చాటారు. 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య ఎనిమిది కాగా, 500కి పైగా మార్కులతో మెరిసిన విద్యార్థులు మొత్తం 25 మంది. ఈ ఫలితాలు పాఠశాల విద్యా ప్రమాణాలకు అద్దంపడుతున్నాయి. విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయ బృందం మార్గనిర్దేశం, తల్లిదండ్రుల సహకారం ఫలితంగా ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. విజేతలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

## పదవ తరగతిలో రామయంపేట మండల్ టాపర్ గా కే. ప్రశాంతి

**ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మెదక్ జిల్లా ప్రతినిధి**
ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో రామాయంపేట మండలంలోని ప్రగతి ధర్మారం పాఠశాలకు చెందిన కే. ప్రశాంతి అనే విద్యార్థిని రామయంపేట మండల్ టాపర్ గా నిలిచారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 61 మంది విద్యార్థులకు గాను 60 మంది పదవ తరగతిలో ఉత్తీర్ణులవడం విశేషం. మండల టాపర్ గా నిలిచిన విద్యార్థిని ప్రశాంతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని కే. ప్రశాంతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉత్తమ బోధన సహకారం వల్లే తాను ఉత్తీర్ణత సాధించానని సంతోషం వెలిబుచ్చారు.

## వెల్దండలో రామలింగేశ్వర స్వామి దేవాలయ ముఖద్వారం ప్రారంభం




**వెల్దండ, ఏప్రిల్ 30 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కేంద్రంలో వెలసిన శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి నిర్మితమైన నూతన ముఖద్వారాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యుడు ఠాగూర్ బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ హాజరై ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ మహత్కార్యంలో నిర్మాణ దాతలుగా సిలువేరు రామస్వామి గౌడ్, ఆయన ధర్మపత్ని అలివేలు మంగ మరి కుటుంబ సభ్యులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయం 'దక్షిణ కాశీ'గా ప్రసిద్ధి చెందుతూ, భక్తుల నమ్మకాలకు ప్రతిరూపంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో దేవుని అనుగ్రహంతో పుణ్యకార్యాన్ని చేయాలని వారు సంకల్పించడంతో ఈ ముఖద్వారం నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, దేవాలయ కమిటీ చైర్మన్ సందీప్ రెడ్డి, సంజీవ్ కుమార్ యాదవ్, అరుణ్ నాయక్, జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, తక్కెళ్ళపల్లి శేఖర్, శ్రీనివాస్ యాదవ్, కృష్ణ, శివరాజ్, వెల్దండ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ రమేష్, ఎర్ర శీను, దేవాదాయ కమిటీ సభ్యులు, పూజారులు, ఈవో తదితరులు పాల్గొన్నారు.


# బోర్డర్ వద్ద రఫేల్ విమానాల పెట్రోలింగ్



**న్యూఢిల్లీ ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్మూకశ్మీర్ గగన వీధుల్లో మంగళవారం రాత్రి రఫేల్ యుద్ధ విమానాలు పహారా కాసినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పాకిస్థాన్ మీడియా వార్తలను ప్రసారం చేసింది. పాక్ సరిహద్దు వద్ద భారతీయ వైమానిక దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టినట్లు పేర్కొన్నది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న భారత యుద్ధ విమానాలను వెనక్కి పంపినట్లు ఓ కథనంలో పాకిస్థాన్ మీడియా ప్రకటించింది. భారతీయ గగనతల సరిహద్దులోనే ఆ రఫేల్ విమానాలు పెట్రోలింగ్ చేసినట్లు పాక్ మీడియా తెలిపింది. పెట్రోలింగ్ నిర్వహించిన రఫేల్ విమానాలు.. లైన్ ఆఫ్ కంట్రోల్‌ను దాటలేదని పాక్ మీడియా చెప్పింది. రఫేల్ కదలికల్ని తమ వైమానిక దళ విమానాలు గుర్తించినట్లు పాక్ పేర్కొన్నది. అయితే ఇండియా 24 నుంచి 36 గంటల్లో తమపై దాడి చేసే అవకాశాలు ఉన్నట్లు పాక్ మంత్రి అతాహుల్లా తరార్ పేర్కొన్న విషయం తెలిసిందే. మరో వైపు ఇవాళ ప్రధాని మోదీ నేతృత్వంలో క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూర్టీ సమావేశం జరిగింది. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనకు చెందిన అంశంపై ఆ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం జరగడం రెండోసారి. ఫస్ట్ సమావేశంలో సింధూ జలాల ఒప్పందం సస్పెన్షన్ నిర్ణయాన్ని తీసుకున్న విషయం తెలిసిందే.

# రారెత్తిస్తున్న ఎండలు

## రాష్ట్రవ్యాప్తంగా 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్ ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరగుతున్నాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో అత్యధికంగా 44.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇలా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మరోవైపు జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో 44.4, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 44.3, నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.1 డిగ్రీల చొప్పున అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్రంలో గురువారం పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. బుధవారం జయశంకర్ ములుగు, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట జిల్లాల్లో అకడకడా ఈదురు గాలులు, మెరుపులు, ఉరుములతో వర్షాలు పడ్డాయని పేరొంది. గురువారం కూడా మరిన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# ఆరు మాసాలకు భూమికి చైనా వ్యోమగాములు

**బీజింగ్ ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



చైనా రోదసీ స్టేషన్‌లో ఆరు మాసాలు గడిపిన అనంతరం ముగ్గురు చైనా వ్యోమగాములు బుధవారం భూమికి చేరుకున్నారు. చైనాలోని ఉత్తర మంగోలియా మారుమూల ప్రాంతంలో గోబి ఎడారికి చిట్టచివరన వ్యోమగాములు ప్రయాణించిన మాడ్యూల్ దిగింది. బలమైన గాలులు వీస్తుండడం, మసకగా వుండడంతో వారు భూమికి తిరిగి రావడం ఒక రోజు ఆలస్యమైంది. ఈ సమయంలో ఆ ఎడారిలో ఇసుక తుపానులు బాగా వస్తుంటాయి. గతేడాది అక్టోబరులో తియాంగాంగ్ రోదసీ స్టేషన్‌కు వెళ్ళిన కాయి జుఝొ, సాంగ్ లింగ్‌డాంగ్, వాంగ్ హౌజెలు మంగళవారం స్టేషన్ బాధ్యతలను కొత్తగా వచ్చిన సిబ్బందికి అప్పచెప్పి తిరుగుపయనమయ్యారు. ఈ ముగ్గురు వ్యోమగాములు గత ఆరుమాసాల కాలంలో రోదసీ స్టేషన్‌లో అనేక ప్రయోగాలు నిర్వహించారు. వీరిలో కాయి సాంగ్‌లు రోదసీలో 9గంటల పాటు నడిచారు. ప్రపంచంలోనే ఇది అత్యంత సుదీర్ఘమైన నడక అని చైనా రోదసీ సంస్థ వ్యాఖ్యానించింది.

# ఇస్కాన్ నేత చిన్మయ్ కృష్ణదాస్‌కు బెయిల్




**ఢాకా ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బంగ్లాదేశ్‌లో దేశద్రోహం కేసులో అరెస్ట్ అయిన హిందూ నేత చిన్మోయ్ కృష్ణ దాస్‌కి బంగ్లాదేశ్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇస్కాన్ మాజీ నాయాకుడు, బంగ్లాదేశ్ సమ్మిలిత్ సతానత జాగ్రన్ జోట్ ప్రతినిధి అయిన దాస్‌ని నవంబర్ 25న ఢాకా ఎయిర్ పోర్టులో అక్కడి అధికారులు అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్ జెండాను అవమానించారనే కారణంగా అతడిపై దేశద్రోహ కేసు నమోదు చేశారు. తాజాగా, ఆయనకు జస్టిస్ ఎండీ అటోర్ రెహమాన్, జస్టిస్ ఎండీ అలీ రెజాలతో కూడిన ధర్మాసనం బెయిల్‌ని మంజూరు చేసింది. గతేడాది ఆగస్టులో విద్యార్థుల హింసాత్మక ఉద్యమం తర్వాత షేక్ హసీనా పదవికి రాజీనామా చేసి భారత్ పారిపోయి వచ్చారు. ఆ తర్వాత, బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. అయితే, షేక్ హసీనా గద్దె దిగిన తర్వాత, బంగ్లా వ్యాప్తంగా మైనారిటీ-లు, ముఖ్యంగా హిందువులు టార్గెట్‌గా దారుణమైన హింస చెలరేగింది. హిందువుల ఇళ్లు, ఆస్తులు, వ్యాపారాలు, గుడులను మతోన్మాదులు టార్గెట్ చేసి దాడులకు పాల్పడ్డారు. ఆ సమయంలో ఈ హింసకు వ్యతిరేకంగా చిన్మోయ్ కృష్ణ దాస్ మైనారిటీల హక్కుల కోసం నినదించారు. ఈ నేపథ్యంలో అతడిని సైలెంట్ చేసేందుకు యూనస్ సర్కార్ దేశద్రోహ కేసు పెట్టింది. పలు సందర్భాల్లో అతడి బెయిల్‌ని కింది కోర్టులు తోసిపుచ్చుతూ వచ్చాయి. అతడి తరుపున వాదించడానికి కూడా లాయర్ రాని పరిస్థితి నెలకొంది. ముస్లిం బార్ అసోసియేషన్ అతడి తరుపున వాదించవద్దని హెచ్చరికలు కూడా జారీ చేసింది. నవంబర్ 27న చట్టోగ్రామ్(చిట్టగాంగ్) కోర్టు వెలుపల దాస్ అనుచరులు, అధికారులకు మధ్య హింసాత్మక ఘర్షణ జరిగింది. ఇందులో ఒక న్యాయవాది మరణించారు. అతడి అరెస్ట్‌పై భారత్ కూగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఘటన రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినడానికి కారణమైంది.

# పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కమాండర్ కీలక పాత్ర..

## గుర్తించిన ఎన్ఐఏ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్ముకశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరాన్ వ్యాలీలో ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన విషయం తెలిసిందే. టూరిస్ట్‌లే లక్ష్యంగా విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ) దర్యాప్తును ముమ్మరంగా చేస్తోంది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. తాజాగా పెహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కమాండర్ ఫరూక్ అహ్మద్ కీలక పాత్ర పోషించినట్లు తెలిసింది. ఈ మేరకు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియా నివేదిస్తోంది.సదరు నివేదికల ప్రకారం.. పెహల్‌గామ్ దాడి తర్వాత కశ్మీర్ లోయలో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పలు జిల్లాల్లోని ఉగ్రవాదులు, అనుమానితుల ఇళ్లను బాంబులతో పేల్చేస్తున్నాయి. కుప్వారాలోని ఫరూక్ అహ్మద్ ఇంటిని కూడా భద్రతా దళాలు ఇటీవలే కూల్చేశాయి. అహ్మద్ ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తన స్లీపర్ సెల్ నెట్‌వర్క్ ద్వారా గత రెండేళ్లుగా కశ్మీర్‌లో పలు ఉగ్రదాడులు నిర్వహించడంలో అహ్మద్ కీలక పాత్ర పోషించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. వీటిలో తాజాగా జరిగిన పెహల్‌గామ్ దాడి ఒకటి. ఇక పాకిస్థాన్‌లోని మూడు సెక్టార్ల నుంచి కశ్మీర్‌లోకి ఉగ్రవాదులు చొరబడేందుకు అహ్మద్ సహకరిస్తున్నట్లు ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. ఈ లష్కర్ కమాండర్‌కు లోయలోని పర్వత మార్గాల గురించి విస్తృతమైన పరిజ్ఞానం ఉందని పేర్కొన్నాయి. నిఘా వర్గాల ప్రకారం.. అహ్మద్ 1990 నుంచి 2016 వరకూ పాక్ - భారత్ మధ్య పలుమార్లు ప్రయాణించినట్లు గుర్తించారు. పెహల్‌గామ్ దాడి తర్వాత ఫరూక్ అహ్మద్ సహాయకులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. గత రెండేళ్లుగా.. అహ్మద్ పాకిస్థాన్ నుంచి పనిచేస్తూ కశ్మీర్‌లోని తన నెట్‌వర్క్‌ను సంప్రదించడానికి సురక్షిత కమ్యూనికేషన్ యాప్‌లను ఉపయోగిస్తున్నట్లు కూడా నిఘా వర్గాలు తెలిపాయి.

# ఎపి, తెలంగాణ అసెంబ్లీ సీట్ల పెంపు

## సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

**న్యూఢిల్లీఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపుపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 26 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంచాలని చట్టం సూచిస్తుంది. ఈ నిబంధన అమలు చేయాలని కోరుతూ డాక్టర్ కె. పురుషోత్తమ్ రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్ల సంఖ్యను పెంపునకు పునర్విభజన ప్రక్రియను ప్రారంభించే విధంగా కేంద్రానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ పూర్తి చేసిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసు రాజకీయ, రాజ్యాంగ దృష్ట్యా రెండు రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను మినహాయించి, కొత్తగా ఏర్పడిన జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాలను మాత్రమే డిలిమిటేషన్ చేయడం అసమంజసమైనదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఈ పిటిషన్‌పై కేంద్రం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతి స్పందనలను కూడా సుప్రీంకోర్టు కోరింది. డిలిమిటేషన్ కమిషన్ నోటిఫికేషన్లో రాష్ట్రాలను చేర్చడం,మినహాయించడం కేంద్ర ప్రభుత్వం బాధ్యతని పేర్కొన్న ఎన్నికల కమిషన్ అఫిడవిట్‌ను న్యాయవాది ప్రస్తావించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా సమాధానం దాఖలు చేయలేదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ కెఎం నటరాజ్ వాదనలు వినిపిస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం ఈ ప్రక్రియ 2026 జనాభా లెక్కల వరకు వేచి ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాత్రికి రాత్రే చేపట్టలేని ఒక భారీ కసరత్తు అని అన్నారు. పిటిషనర్ లేవనెత్తిన జమ్మూ కాశ్మీర్ డీలిమిటేషన్ కేంద్రపాలిత ప్రాంతం విషయంలో జరిగిందని ఎఎస్ జి పేర్కొన్నారు.

# ఎవరెస్ట్ అధిరోహణకు కొత్త షరతులు

## 7వేల మీటర్లు అధిరోహిస్తేనే ఇకపై అవకాశం



**ఖాట్మండు ఏప్రిల్ 30 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించే క్రమంలో చోటు చేసుకుంటున్న మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని నేపాల్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో 7వేల మీటర్లకు పైగా ఎత్తు గల శిఖరాలను అధిరోహించిన పర్వతారోహకులనే మౌంట్ ఎవరెస్ట్ అధిరోహించడానికి అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోందని మీడియా వార్తలు తెలిపాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడానికి ప్రపంచ వ్యాప్తంగా వేలాదిమంది పర్వతారోహకులు ఆసక్తి చూపిస్తూ వుంటారు. 1953లో తొలిసారిగా ఎడ్మండ్ హిల్లరీ, టెన్సింగ్ నార్కేలు ఈ పర్వతాన్ని అధిరోహించినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 9వేల మంది పర్వతారోహకులు విజయవంతంగా ఈ శిఖరాన్ని అధిరోహించారు. మరో 300మంది ఈ సందర్భంగా ప్రాణాలు పోగొట్టుకున్నారు. కేవలం ఎక్కాలన్న ఆసక్తి, ఆకాంక్ష వున్నంత మాత్రాన ఎక్కడం ఇకపై సాధ్యం కాదని, ముందుగా మిమ్మల్ని మీరు రుజువు చేసుకున్న వారికే ఇకపై ఎవరెస్ట్‌ను అధిరోహించే అవకాశం వస్తుందని నేపాల్ ప్రభుత్వం పేర్కొంటోంది. ఇందుకు కొత్త ముసాయిదా బిల్లు రూపొందించింది. ఏప్రిల్ 18న పార్లమెంట్ ఎగువ సభ ఆమోదించింది. కొన్ని మార్పులు, చేర్పులతో ఈ ముసాయిదా బిల్లు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందుతుందని భావిస్తున్నారు. ఎవరెస్ట్‌పైకి చేరే క్రమంలో ఎక్కువమంది చనిపోవడం, పర్వత శిఖరాలపై చెత్త పేరుకుపోవడం వంటి కారణాల వల్ల నేపాల్ ఈ నిర్ణయం తీసుకుంది